

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



శుక్రవారం 20-11-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :151 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

21 నుంచే పంచాయతీ నామినేషన్లు

- మూడో విడత ఎన్నికలకు నోటిఫికేషన్
- నవంబర్ 21 నుంచి నామినేషన్లు
- 23వ తేదీతో నామినేషన్ల స్వీకరణ పూర్తి
- 24న నామినేషన్ల పరిశీలన
- 27న తుది అభ్యర్థుల జాబితా
- డిసెంబర్ 2న గ్రామ పంచాయతీ పోలింగ్
- అదే రోజు ఓట్ల లెక్కింపు, ఫలితాలు
- పోలింగ్ రోజే ఉపసర్పంచ్ ఎన్నిక



న్యూస్ డెస్క్, 19 నవంబర్ (ఇది కద నిజం): రాష్ట్రంలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను అధికారులు ప్రకటించారు. నోటిఫికేషన్ ప్రకారం.. ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. అనంతరం 24వ తేదీన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ చేపట్టనుండగా, నామినేషన్ల విత్ డ్రా కు ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఇచ్చారు.

ఉపసంహరణ గడువు ముగిసిన వెంటనే, అదే రోజు (నవంబర్ 27) పోటీలో నిలిచే తుది అభ్యర్థుల జాబితాను ఎన్నికల అధికారులు ప్రకటించనున్నారు.

రాజగోపాల్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీరియస్!

- ఏఐసీసీకి అధికారికంగా ఫిర్యాదు
- వీడియో క్లిప్పింగ్స్‌తో హైకమాండ్‌కు నివేదిక
- పార్టీ, ప్రభుత్వానికి ఇబ్బందికరంగా వ్యాఖ్యలు
- గతంలోనూ సీఎం రేవంత్‌పై విమర్శలు
- క్రమశిక్షణ చర్యలకు అధిష్టానం సిద్ధమా? 2 లో
- షోకాజ్ లేదా సస్పెన్షన్‌పై ఉత్కంఠ

జలవాటాలో ఒక్క చుక్కా వదలం!

- జలవాటాలో తెలంగాణ వాటా వదులుకోం
- ఏపీ నీటి తరలింపు యత్నాలకు అడ్డుకట్ట
- 1.8 టీఎంసీల తరలింపుపై అభ్యంతరం
- కేఆర్ఎంబీ, కేంద్రానికి ఫిర్యాదులు
- ఎల్ నినోతో యాసంగి వరి సాగు వద్దు
- తాగునీటి అవసరాలకే రిజర్వాయర్లలో నిల్వలు
- సైనికుడి నిబద్ధతతో పనిచేస్తున్నా 2 లో

నక్సలిజం అంతం.. భద్రత కట్!



న్యూస్ డెస్క్, 19 నవంబర్ (ఇది కద నిజం): ఆపరేషన్ కగార్ తో పాటు ప్రభుత్వం తీసుకున్న లొంగుబాటు చర్యల వల్ల రాష్ట్రంలో నక్సలిజం అంతం అయినట్లు అధికారికంగా ప్రకటించిన ఛత్తీస్ గఢ్ ప్రభుత్వం వీఐపీ భద్రతా విషయంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 100 మందికి పైగా రాజకీయ నేతల భద్రతలో కోత విధించారు. బస్తర్ డివిజన్‌కు చెందిన 47 మంది వీఐపీ నేతల భద్రతను పూర్తిగా తొలగించారు. మరోవైపు, 50 మందికి పైగా నేతల భద్రతా కేటగిరీని తగ్గించారు. హోం శాఖకు చెందిన ప్రొటెక్షన్ రివ్యూ కమిటీ నిర్ణయం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ నేతల భద్రతలో కోత విధించారు.

సిద్దిపేట గడ్డ కాంగ్రెస్ అడ్డా

న్యూస్ డెస్క్, 19 నవంబర్ (ఇది కద నిజం): నేటి నుంచి సిద్దిపేట గడ్డ కాంగ్రెస్ అడ్డా అని పార్టీ కార్యకర్తలు నిరూపించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసించారు. సిద్దిపేటలో పర్యటించిన ఆయన రూ.565 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం దాదాపు 2 కిలోమీటర్ల మేర పాదయాత్రగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్ లక్ష్యంగా తీవ్ర విమర్శలు గుప్పించారు.

మిగతాది 2 లో..

- రూ.565 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం!
- మెడికల్ కాలేజీకి మదన్‌మోహన్ పేరు!
- కేసీఆర్ కుటుంబ ఆస్తులపై రేవంత్ గురి!
- కాళేశ్వరంపై అవినీతి ఆరోపణల అస్త్రం!
- సాగునీటి ప్రాజెక్టులపై కేసీఆర్‌కు సవాల్!
- కేటీఆర్‌పై సీఎం రేవంత్ ఫైర్!
- 2034 వరకు ఇందిరమ్మ రాజ్యమే!
- గజ్వేల్, సిద్దిపేటలో కాంగ్రెస్ జెండానే!

నీళ్లపై నీతులెందుకు బీఆర్ఎస్?

- బీఆర్ఎస్‌కు నీతులు చెప్పే అర్హత లేదు
- పదేళ్ల పాలనలో తెలంగాణకు అన్యాయం
- ఏపీకి 64 శాతం..తెలంగాణకు 36 శాతం
- కేఆర్ఎంబీకి అప్పగించింది మీరే
- బనకచర్లపై సంతకాలు చేసింది బీఆర్ఎస్
- నీటి వాటాలో కాంప్రమైజ్ అయ్యేది లేదు
- రూ.1.84 లక్షల కోట్లు వృథా



న్యూస్ డెస్క్, 19 నవంబర్ (ఇది కద నిజం): కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. వారి వ్యాఖ్యలను పార్టీ అధిష్టానం పరిశీలిస్తోందని, ఈ వ్యవహారంపై హైకమాండ్ ఇప్పటికే దృష్టి సారించిందని స్పష్టం చేశారు. గురువారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. సమయం, సందర్భాన్ని బట్టి అధిష్టానం తగిన నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. పార్టీ క్రమశిక్షణ విషయంలో అందరూ సమానమేనని అన్నారు. ఇక కొత్త ఇన్‌ఛార్జ్ సందీప్ నిబద్ధత గల నాయకుడని పేర్కొన్నారు.

2 లో

రాయితీలు సరే.. జీతాల పెంపేదీ?



- కార్పొరేట్ దిగ్గజాలకు మోదీ సూటి ప్రశ్న
- ఉద్యోగాలేవి.. వేతనాల పెంపేది?
- పన్ను రాయితీలకు తగ్గ ఫలితాలేవి?
- 'ఇండియా ఫస్ట్'కు మోదీ పిలుపు
- 12 ఏళ్లలో 50 కోట్ల మందికి పేదరికం దూరం
- 7 శాతం వృద్ధితో దూసుకెళ్తున్న భారత్
- ఎగుమతుల్లో సరికొత్త రికార్డు 2 లో

తెలంగాణ టార్గెట్.. 3 ట్రిలియన్ డాలర్లు!

- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం
- తెలంగాణ అభివృద్ధికి మూడు ఆర్థిక జోన్లు
- క్యూర్‌లో సేవా రంగానికి ప్రాధాన్యం
- ప్యూర్‌లో తయారీ రంగం విస్తరణ
- రేర్‌లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు
- కొత్త ఆసుపత్రులతో 8 వేల పడకలు
- డిసెంబర్ 7 నుంచి ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్



న్యూస్ డెస్క్, 19 నవంబర్ (ఇది కద నిజం): హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా జరుగుతున్న 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ వార్షిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఘన చరిత్ర కలిగిన హైదరాబాద్ నగరానికి విచ్చేసిన దేశవిదేశీ అతిథులకు ఆయన ఘన స్వాగతం పలికారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 సంవత్సరానికి ఎంతో ప్రాధాన్యత ఉందని, ఆ సమయానికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు.

ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల!



- ఇంటర్ పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ విడుదల
- ఫిబ్రవరి 24 నుంచి ఫస్టియర్ పరీక్షలు
- ఫిబ్రవరి 25 నుంచి సెకండియర్ పరీక్షలు
- మార్చి 20తో ముగియనున్న పరీక్షలు
- ఫిబ్రవరి 11 నుంచి ప్రాక్టికల్స్ 2 లో
- జనవరి 20 నుంచి ఇంటర్నల్ అసెస్‌మెంట్

ఆయిల్‌పామ్‌లో తెలంగాణ టాప్!

- దేశ సాగు విస్తీర్ణంలో 21 శాతం వాటా
- 91 వేల మందికి పైగా రైతుల సాగు
- రైతుల ఖాతాల్లో రూ.430 కోట్ల సాయం
- గెలల విక్రయాలతో రూ.1,213 కోట్ల ఆదాయం
- 10 లక్షల ఎకరాలకు సాగు విస్తరణ లక్ష్యం
- వచ్చే ఏడాది అందుబాటులోకి 8 మిల్లులు
- టన్నుకు రూ.25 వేల హామీ ధరకు డిమాండ్



న్యూస్ డెస్క్, 19 నవంబర్ (ఇది కద నిజం): దేశంలో వంటనూనెల ఉత్పత్తిని పెంచడంతోపాటు దిగుమతులపై ఆధారాన్ని తగ్గించే లక్ష్యంతో తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ వేగం పుంజుకుంటోంది. ఇప్పటికే సాగు విస్తీర్ణంలో దేశంలో అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రం.. ఇప్పుడు దిగుబడి, గెలల కొనుగోలు, ప్రాసెసింగ్ సదుపాయాల విస్తరణపై దృష్టి సారిస్తోంది. వ్యవసాయశాఖ నవంబర్ 7, 2026న వెల్లడించిన గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా 15.70 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతుండగా, తెలంగాణలో 91,343 మంది రైతులు 3.33 లక్షల ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. అంటే జాతీయ సాగు విస్తీర్ణంలో రాష్ట్ర వాటా సుమారు 21 శాతంగా ఉంది.

రూ.430 కోట్ల సాయం

డిసెంబర్ 2023 నుంచి ఇప్పటివరకు 45,679 మంది రైతులను 1.50 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగులోకి తీసుకొచ్చారు. మొక్కల కొనుగోలు, తోటల నిర్వహణ కోసం ఇప్పటివరకు రూ.430 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు. 2026-27లో ఇప్పటివరకు 41,777 ఎకరాల్లో కొత్తగా మొక్కలు నాటగా, ఎకరాకు రూ.46,250 చొప్పున రాయితీ అందిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.08 లక్షల ఎకరాల ఆయిల్‌పామ్ తోటలు దిగుబడి దశకు చేరుకోవడం గమనార్హం. జాతీయ వంటనూనెల మిషన్-ఆయిల్‌పామ్ (ఎన్ఎంఈఓ-ఓపీ) పథకం కింద 2.86 లక్షల ఎకరాల్లో సాగుతో రాష్ట్రం ముందంజలో ఉంది. అంతేకాకుండా ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో (ఓఈఆర్) 20.01 శాతంతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది.

2 లో

మేడిగడ్డను పేల్చేసింది కాంగ్రెస్!

- మేడిగడ్డ పేల్చింది కాంగ్రెస్ నేతలే!
- మరమ్మతులకు రూ.4 వేల కోట్లా?
- రేవంత్ రెడ్డి రెన్యువల్ సీఎం
- మూడేళ్లైనా పూర్తికాని మరమ్మతులు
- ఆరు గ్యారెంటీల కార్డులు ఏమయ్యాయి?
- 4.70 లక్షల పెన్షన్లకు కోత 2 లో
- బీఆర్ఎస్ రాక కోసం ప్రజల ఎదురుచూపులు

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

శుక్రవారం 20-11-2026

ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల!


TELANGANA BOARD OF INTERMEDIATE EDUCATION
Vidya Bhavan, Nampally, Hyderabad

File No: TGBIE-EXAMS/T1/2026-EXAMS-31 TIMETABLE Date:19-11-2026.

PRESS RELEASE

It is hereby informed to all the Intermediate 1st & 2nd year students (of both General & Vocational streams) that, the tentative Time-table for Intermediate Public Examinations, March-2027 of Telangana State Board of Intermediate Education is Broken Hereunder.

Tentative TIME-TABLE for 1st Year & 2nd Year Examinations, March 2027

a. The Practical Examinations for 2nd year science subjects will be conducted from 01-02-2027 (Monday) to 10-02-2027 (Wednesday) (including Sundays) in two sessions i.e., Morning Session from 9.00 A.M. to12.00 Noon and Afternoon Session from 2.00 P.M to 5.00 P.M.

b. The Practical Examinations for 1st year science subjects (As per new pattern) will be conducted from 11-02-2027 (Thursday) to 18-02-2027 (Thursday) (including Sundays) in three sessions (2 Hours in each session) i.e., Session-1 from 9.00 A.M. to 11.00 A.M., Session-2 from 12.00 noon to 2.00 P.M. and Session-3 from 3.00 P.M to 5.00 P.M.

c. English Practical Exams for First Year will be conducted on 29-01-2027 (Friday) from 10.00 A.M. to 1.00 P.M. (one day) and 30-01-2027 (Saturday).

d. The Ethics and Human Values Examination will be conducted on 29-01-2027 (Friday) from 10.00 A.M. to 1.00 P.M. (one day)

e. The Environmental Education Examination will be conducted on 27-01-2027 (Wednesday) from 10.00 A.M to 1.00 P.M. (one day)

f. 1 year Internal assessment from 25-01-2027 to 29-01-2027.

INTERMEDIATE PUBLIC EXAMINATIONS, Feb/March 2027

Day & Date	FIRST YEAR EXAMS Time: 9.00 A.M. to 12.00 Noon	Day & Date	SECOND YEAR EXAMS Time: 9.00 A.M. to 12.00 Noon
Day 1 04-02-2027 (Wednesday)	PART-I(i) 2nd LANGUAGE PAPER-I	Day 2 05-02-2027 (Thursday)	PART-I(i) 2nd LANGUAGE PAPER-II
Day 2 06-02-2027 (Friday)	PART-I(ii) ENGLISH PAPER-I	Day 3 07-02-2027 (Saturday)	PART-I(ii) ENGLISH PAPER-II
Day 5 09-02-2027 (Tuesday)	PART-II(i) MATHEMATICS PAPER-IA BOTANY PAPER-I POLITICAL SCIENCE PAPER-I ACCOUNTANCY PAPER-I (For ACE Group)	Day 6 10-02-2027 (Wednesday)	PART-II(i) MATHEMATICS PAPER-IIA BOTANY PAPER-II POLITICAL SCIENCE PAPER-II
Day 7 11-02-2027 (Friday)	PART-2(i) MATHEMATICS PAPER-IB ZOOLOGY PAPER-I HISTORY PAPER-I COMMERCE PAPER-I (For ACE Group)	Day 8 12-02-2027 (Friday)	PART-2(i) MATHEMATICS PAPER-IIB ZOOLOGY PAPER-II HISTORY PAPER-II
Day 9 13-02-2027 (Monday)	PHYSICS PAPER-I ECONOMICS PAPER-I	Day 10 15-02-2027 (Tuesday)	PHYSICS PAPER-II ECONOMICS PAPER-II
Day 11 15-02-2027 (Monday)	CHEMISTRY PAPER-I COMMERCE & ACCOUNTANCY PAPER-I	Day 12 16-02-2027 (Tuesday)	CHEMISTRY PAPER-II COMMERCE & ACCOUNTANCY PAPER-II
Day 13 17-02-2027 (Wednesday)	PUBLIC ADMINISTRATION PAPER-I MATHEMATICS PAPER-I (Single Paper for MEC Group)	Day 14 18-02-2027 (Thursday)	PUBLIC ADMINISTRATION PAPER-II
Day 15 19-02-2027 (Friday)	MODERN LANGUAGE PAPER-I GEOGRAPHY PAPER-I BRIDGE COURSE MATHEMATICS PAPER-I (Now & Old Pairs) – For BIPC	Day 16 20-02-2027 (Saturday)	MODERN LANGUAGE PAPER-II GEOGRAPHY PAPER-II BRIDGE COURSE MATHEMATICS PAPER-II – For BIPC Students

The above dates are applicable to Intermediate Vocational Course Examinations also. However, the Vocational courses Time table will be issued separately.

sd/- Smt. Ashiwini Abhinav, I.A.S., SECRETARY

COMPTROLLER OF EXAMINATIONS

న్యూస్ డెస్క్, 19 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణ ఇంటర్మీడియట్ ఫస్టియర్, సెకండియర్ (జనరల్, ఒకేషనల్) విద్యార్థులకు సంబంధించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల తాత్కాలిక టైమ్‌టేబుల్‌ను తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి విడుదల చేసింది. ఈ మేరకు ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు ఫిబ్రవరి 24న ప్రారంభమై మార్చి 19న ముగుస్తాయి. అదేవిధంగా సెకండియర్ పరీక్షలు ఫిబ్రవరి 25న ప్రారంభమై మార్చి 20న పూర్తవుతాయి. కొత్త విధానం ప్రకారం ఫస్టియర్ సైన్స్ ప్రాక్టికల్స్‌ను ఫిబ్రవరి 11 నుంచి ఫిబ్రవరి 18 వరకు ఒక్కో సెషన్ 2 గంటల చొప్పున మూడు సెషన్లలో నిర్వహిస్తారు.

ప్రాక్టికల్స్, ఇతర పరీక్షల వివరాలు ఇలా..

ఫస్టియర్ ఇంటర్నల్ అసెస్‌మెంట్‌ను 2027 జనవరి 20 నుంచి జనవరి 25 వరకు నిర్వహిస్తారు. ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షను జనవరి 27న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్షను జనవరి 29న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తారు. ఇక ఫస్టియర్ సైన్స్ ప్రాక్టికల్స్ విషయానికొస్తే.. మొదటి సెషన్ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు, మూడో సెషన్ సాయంత్రం 3.30 గంటల నుంచి 5.30 గంటల వరకు జరుగుతాయి. ఈ తేదీలు ఒకేషనల్ కోర్సులకు కూడా వర్తిస్తాయని, అయితే ఒకేషనల్ టైమ్‌టేబుల్‌ను విడిగా జారీ చేస్తామని అధికారులు తెలిపారు.

మేడిగడ్డను పేల్చేసింది కాంగ్రెస్!



న్యూస్ డెస్క్, 19 నవంబర్ (ఇది కద నిజం): కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజీని కాంగ్రెస్ పార్టీ నేతలే పేల్చివేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇవాళ తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు.

మేడిగడ్డ మరమ్మతులు, అంచనాలపై విమర్శలు

మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినడంపై అప్పట్లోనే ఇంజినీర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా, కేవలం రెండు పిల్లర్లకు మరమ్మతులు చేయించలేకపోతున్నారని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్టు కొట్టుకుపోవాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరిక అని కేటీఆర్ ఆరోపించారు. రూ. 400 కోట్లతో పూర్తయ్యే మరమ్మతుల కోసం, రూ. 4,000 కోట్లు ఖర్చు చేయాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు.

రెగ్యులర్ సీఎం కాదు.. రెన్యువల్ సీఎం..

రాష్ట్రంలో మూడేళ్ల కాంగ్రెస్ పాలనపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని కేటీఆర్ పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం కాంగ్రెస్ పాలన గురించి మాజీ సీఎం కేసీఆర్ చెప్పిన మాటలే నేడు అక్షరాలా నిజమవుతున్నాయని అన్నారు. రేవంత్ రెడ్డి రెగ్యులర్ ముఖ్యమంత్రి కాదని, కేవలం 'రెన్యువల్ సీఎం' అని ఆయన ఎద్దేవా చేశారు. ఢిల్లీ పెద్దలు రాష్ట్రానికి వస్తుంటే సీఎం వణికిపోతున్నారని, జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నేతలు ఢిల్లీ నాయకత్వాలకు బానిసల్లా మారిపోయారని కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

ఆరు గ్యారెంటీలు, పెన్షన్ల తొలగింపుపై ప్రశ్నలు

ఎన్నికల సమయంలో ఓట్ల కోసం బీఆర్ఎస్ ఎప్పుడూ అవాస్తవాలు చెప్పలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ పంపిణీ చేసిన ఆరు గ్యారెంటీల కార్డులు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. కొత్త పెన్షన్ల మంజూరు పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామా చేస్తోందని ఆయన విమర్శించారు. గత మూడేళ్ల కాలంలో ఏకంగా 4.70 లక్షల పెన్షన్లను తొలగించి, ఇప్పుడు కొత్తగా 4.65 లక్షల మందికి పెన్షన్లు ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ మళ్లీ ఎప్పుడు అధికారంలోకి వస్తుందా అని రాష్ట్ర ప్రజలంతా ఎదురుచూస్తున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

నీళ్లపై నీతులెందుకు బీఆర్ఎస్?

మొదటి పేజీ తరువాయి

కృష్ణా జలాలపై బీఆర్ఎస్‌కు నీతులు చెప్పే అర్హత లేదు:

అధికారంలో ఉండగా కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిన బీఆర్ఎస్, ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. కృష్ణా జలాల విషయంలో కేటీఆర్, హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలపై ఆయన తీవ్రంగా స్పందించారు. బీఆర్ఎస్ హయాంలో ఏం జరిగిందో ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. పదేళ్ల పాలనలో కృష్ణా జలాల విషయంలో బీఆర్ఎస్ తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. నీటి విషయంలో తప్పిదాలను , ద్రోహాన్ని కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ నేతల నీతులు చెబుతున్నారని దుయ్యబట్టారు. నాడు ఏపీకి 64 శాతం, తెలంగాణకు 36 శాతం వాటా చాలని కేసీఆర్ అంగీకరించారని, కానీ నేడు తమ ప్రభుత్వం 70 శాతం వాటా కోసం పోరాడుతోందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ఏపీ 4,464 టీఎంసీల కృష్ణా జలాలను వినియోగించుకుంటే, తెలంగాణకు దక్కింది కేవలం 1,993 టీఎంసీలేనని లెక్కలతో సహా వివరించారు.

కేఆర్ఎంబీకి అప్పగించింది మీరే:

పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా తేలేకపోయారని, దక్షిణ తెలంగాణకు వరప్రదాయిని అయిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను పదేళ్లు పక్కన పెట్టారని దుయ్యబట్టారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్, ఆర్డీఎస్ ఆధునీకరణ, డిండి వంటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇచ్చుంటే రాష్ట్రంలో సాగునీటి విస్తీర్ణం ఎంతో పెరిగేదన్నారు. అనాడు ఏపీ పోలీసులు నాగార్జున సాగర్ డ్యామ్‌లోని సగం గేట్లు స్వాధీనం చేసుకున్నారని, ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడానికి అభ్యంతరం లేదని చెప్పింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. బనకచర్ల విషయంలో సంతకాలు చేసిందీ మీరేనని విమర్శించారు.

కాంప్రమైజ్ అయ్యేది లేదు:

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నాగార్జున సాగర్ నుంచి నీళ్లు తరలివెళ్లకుండా అడ్డుకున్నామని, బనకచర్లపై కేంద్రానికి లేఖలు రాయడం వల్లే ఆ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు ఆగిపోయాయని తెలిపారు. తెలంగాణ వాటా విషయంలో ఒక్క చుక్క నీరు కూడా పక్కకు వెళ్లకుండా చర్యలు తీసుకుంటామని, అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్లడానికి కూడా సిద్ధమని స్పష్టం చేశారు. డ్యామ్ మీద కేంద్ర బలగాలు, కేఆర్ఎంబీ నియంత్రణ కేంద్రం చేతిలో ఉన్నా.. కేంద్రాన్ని ఒక్క మాట అనకుండా కేవలం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయడంలో బీఆర్ఎస్-బీజేపీ మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని ఆరోపించారు.

కేటీఆర్ డ్రామాలు నమ్మరు:

సాగునీటి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ. 1.84 లక్షల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసిందని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. నెహ్రూ హయాంలో కట్టిన ప్రాజెక్టులు దేవాలయాల్లా ఉంటే, కాళేశ్వరం ప్రాజెక్టును మాత్రం అత్యంత లోపభూయిష్టంగా నిర్మించారని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, జాతీయ స్థాయి నిపుణులే సర్టిఫై చేశారని చెప్పారు. ఎన్డీఎస్ఏ క్లియరెన్స్ ఇస్తే కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగించుకోవడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేసి ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ బిల్లులను సైతం కాంగ్రెస్ ప్రభుత్వమే చెల్లిస్తోందని, కేటీఆర్ ఎన్ని డ్రామాలు ఆడినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని హితవు పలికారు.

రాయితీలు సరే.. జీతాల పెంపేదీ?



న్యూస్ డెస్క్, 19 నవంబర్ (ఇది కద నిజం): కార్పొరేట్ సంస్థలకు పన్ను రాయితీలు ఇచ్చాం.. మరి ఉద్యోగాలేవి? జీతాల పెంపు ఏది? అంటూ ప్రధాని నరేంద్ర మోడీ భారతీయ పారిశ్రామిక దిగ్గజాలను సూటిగా ప్రశ్నించారు.కార్పొరేట్ పన్ను రేటును 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించామని, కొత్త పన్ను విధానంలో వ్యక్తిగత ఆదాయపు పన్నును రూ.12 లక్షల వరకు పూర్తిగా మినహాయించామని తెలిపారు. 'మీరు ఎప్పుడూ మరిన్ని రాయితీలు కావాలని అడుగుతూనే ఉంటారు. కానీ, అందుకు తగ్గట్టుగా మీరు ఎక్కువ మంది ఉద్యోగులను నియమించుకున్నారా? మీ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాలను పెంచారా?' అంటూ ప్రధాని నిలదీశారు. గురువారం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ శతాబ్ది ఉత్సవాల వార్షిక సదస్సును ప్రారంభించిన ప్రధాని, దేశంలోని అత్యున్నత వ్యాపారవేత్తలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. పన్ను రిటర్నులు, రీఫండ్‌లను సులభతరం చేశామని, గతంలో 8 నెలలు పట్టే రీఫండ్‌లు ఇప్పుడు వారం రోజుల్లోనే వస్తున్నాయని పేర్కొన్నారు.

'ఇండియా ఫస్ట్' మంత్రం పాటించాలి:

వచ్చే 20 ఏళ్లలో పారిశ్రామికవేత్తలు తీసుకునే ప్రతి దీర్ఘకాలిక పెట్టుబడి నిర్ణయానికి 'ఇండియా ఫస్ట్' అనేదే పునాది కావాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. దీనివల్ల దేశం ఆత్మనిర్భర్‌గా మారడమే కాకుండా, వ్యాపార వృద్ధికి కొత్త అవకాశాలు లభిస్తాయన్నారు. వందేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న ఫిక్కీని అభినందించిన ప్రధాని.. మారుతున్న కాలానికి అనుగుణంగా దేశ ఆర్థిక ప్రయాణంలో ఫిక్కీ కీలక పాత్ర పోషించిందని కొనియాడారు.

50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు:

గత వందేళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ ఎన్నో ఒడిదుడుకులను చూసిందని ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. లైసెన్స్ కోటా రాజ్, జాతీయీకరణ వైఫల్యాలు, 21వ శతాబ్దంలో 'ఫ్రాజైల్ ఫైవ్' (బలహీన ఆర్థిక వ్యవస్థలు) జాబితాలో ఉన్న భారత్.. గత 12 ఏళ్లలో యువత, రైతులు, కార్మికులు, పారిశ్రామికవేత్తల కృషితో నేడు ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా (సుమారు 7 శాతం వృద్ధి రేటుతో) అవతరించిందన్నారు. గత నెలలో భారత వస్తువుల ఎగుమతులు దాదాపు 50 బిలియన్ డాలర్లకు చేరుకుని ఆల్ టైమ్ రికార్డు సృష్టించాయని తెలిపారు. తాజా ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం.. కేవలం 12-13 ఏళ్లలోనే 50 కోట్ల మంది భారతీయులు పేదరికాన్ని జయించారని ప్రధాని వివరించారు.

నక్సలిజం అంతం.. భద్రత కట్!

మొదటి పేజీ తరువాయి

ఈ నిర్ణయం కింద ముఖ్యమంత్రి సతీమణి కౌశల్య సాయ్, మంత్రులు, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలతో సహా పలువురు ప్రముఖ రాజకీయ నాయకుల భద్రతా ఏర్పాట్లలో మార్పులు చేశారు.

దశలవారీగా నేతల భద్రత కుదింపు: రాష్ట్రంలో నక్సల్ కార్యకలాపాలు తగ్గుముఖం పట్టడం, ప్రస్తుత శాంతిభద్రతల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ సమీక్ష నిర్వహించినట్లు తెలుస్తోంది. ఆయా నేతలకు కల్పిస్తున్న భద్రతను పరిశీలించిన అనంతరం ప్రొటెక్షన్ రివ్యూ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. నాయకుల భద్రత తగ్గింపుపై ఇటీవల స్పందించిన ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం విజయ్ శర్మ.. నక్సల్ కేడర్ మొత్తాన్ని గుర్తించి, నిర్మూలించడంతో నక్సలిజం అంతమైందని అధికారికంగా ప్రకటించినప్పటికీ ఇంకా ఆరు నెలల పరివర్తన కాలం ఉందన్నారు. ఆ తర్వాత ప్రతి రాజకీయ నాయకుడికి భద్రతను పూర్తిగా దశలవారీగా తొలగిస్తామని స్పష్టం చేశారు.

మణిపూర్‌కు సీఆర్పీఎఫ్ బెటాలియన్: నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన బస్తర్ నుండి ఒక సీఆర్పీఎఫ్ బెటాలియన్‌ను ఇటీవల మణిపూర్‌కు తరలించారు. దీనిపై స్పందించిన ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ బస్తర్ ప్రాంతంలో కేంద్ర పోలీసు బలగాల అవసరం ఇకపై లేదని, అవి క్రమంగా ఆ ప్రాంతం నుండి తరలిపోతున్నాయని సోమవారం తెలిపారు. కేంద్ర బలగాలు బస్తర్‌కు తిరిగి రావడం లేదని, బదులుగా ఈశాన్య, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ అంతటా ఎన్నికలు, శాంతిభద్రతల విధులను నిర్వహించడానికి వారిని తిరిగి నియమిస్తున్నారని శర్మ పేర్కొన్నారు. నాయకులకు భద్రతా కుదిస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్ర రాజకీయ, పరిపాలనా వర్గాల్లో చర్చ జోరందుకుంది. ముఖ్యంగా నక్సల్ ప్రభావిత ప్రాంతమైన బస్తర్ డివిజన్‌లో పెద్ద సంఖ్యలో వీఐపీ నేతల భద్రతను ఉపసంహరించుకోవడం కీలక పరిణామంగా భావిస్తున్నారు.

జలవాటాలో ఒక్క చుక్కా వదలం!



న్యూస్ డెస్క్, 19 నవంబర్ (ఇది కద నిజం): కృష్ణా, గోదావరి జలాల విషయంలో తెలంగాణ హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఏ పోరాటానికైనా, త్యాగానికైనా సిద్ధమని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లాలో మాట్లాడిన ఆయన.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1.8 టీఎంసీల నీటిని తరలించుకుపోయేందుకు ప్రయత్నిస్తున్న మాట వాస్తవమేనని, కానీ ఒక్క చుక్క నీటిని కూడా తీసుకెళ్లనివ్వబోమని తేల్చి చెప్పారు.

కేఆర్ఎంబీ, కేంద్రానికి ఫిర్యాదులు: ఆంధ్రప్రదేశ్ జలదోపిడి యత్నాలను అడ్డుకునేందుకు ఇప్పటికే కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)తో పాటు కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్లు మంత్రి తెలిపారు. నదీ జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటా కోసం పూర్తిస్థాయిలో పోరాడుతున్నామని, ఒక్క చుక్క జలాన్ని కూడా వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే కృష్ణా, గోదావరి జలాల్లో మన వాటాను సమర్థవంతంగా వినియోగించుకోగలుగుతున్నామని పేర్కొన్నారు.

ఎల్ నినో ప్రభావం.. తాగునీటి నిల్వలకే ప్రాధాన్యం: ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో నీటి వినియోగంపై రైతులకు, ప్రజలకు ఉత్తమ్ కీలక సూచనలు చేశారు. ఎల్ నినో కారణంగా యాసంగి సీజన్‌లో వరి సాగు వద్దని సూచిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకే రిజర్వాయర్లలో నీటిని నిల్వ ఉంచుతున్నామని స్పష్టం చేశారు.

సైనికుడి నిబద్ధతతోనే పనిచేస్తున్నా: గతంలో చైనా సరిహద్దులో సైనికుడిగా పనిచేసిన అనుభవాన్ని గుర్తుచేసుకున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి.. సరిహద్దులో దేశం కోసం ఎలా పనిచేశానో, ఇప్పుడూ అదే నిబద్ధత, అంకితభావంతో పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నానని అన్నారు. ప్రజల ప్రయోజనాలే పరమావధిగా ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు.

రాజగోపాల్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీరియస్!



న్యూస్ డెస్క్, 19 నవంబర్ (ఇది కద నిజం): మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. నిన్న రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన పీసీసీ చీఫ్, ఈ వ్యవహారంపై అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి అధికారికంగా ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. రాజగోపాల్ రెడ్డి మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌లను సైతం ఆయన పార్టీ హైకమాండ్‌కు పంపించినట్లు సమాచారం.

పార్టీకి ,ప్రభుత్వానికి ఇబ్బందికరంగా..

గత కొంతకాలంగా పార్టీకి, ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించేలా రాజగోపాల్ రెడ్డి తరచూ బహిరంగ వ్యాఖ్యలు చేస్తుండటంతో అధిష్టానం ఈ వ్యవహారంపై సీరియస్‌గా దృష్టి సారించింది. మంత్రి పదవిని ఆశిస్తున్న ఆయన, గతంలోనూ పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి వివాదాస్పద రీతిలో మాట్లాడారు. అప్పట్లో పార్టీ పెద్దలు సంయమనం పాటిస్తూ ఆయనపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు తీసుకోలేదు. అయితే, ఈసారి ఏకంగా ముఖ్యమంత్రిని నేరుగా టార్గెట్ చేస్తూ రాజగోపాల్ రెడ్డి విమర్శలు గుప్పించడంతో కాంగ్రెస్ పార్టీలో, ప్రభుత్వ వర్గాల్లో తీవ్ర దుమారం రేగుతోంది. ఈ నేపథ్యంలో పార్టీ హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోందనే అంశం రాజకీయ వర్గాల్లో ఉత్కంఠగా మారింది. క్రమశిక్షణ ఉల్లంఘన కింద ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తారా? లేక నేరుగా పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారా? అన్న చర్చ జోరుగా సాగుతోంది. మరోవైపు, అధిష్టానం తీసుకునే చర్యలకు రాజగోపాల్ రెడ్డి ఎలా కౌంటర్ ఇస్తారనేది కూడా ఇప్పుడు సస్పెన్స్‌గా మారింది.

ఆయిల్‌పామ్‌లో తెలంగాణ టాప్!

మొదటి పేజీ తరువాయి

రైతులకు ఆదాయం: ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు అనుగుణంగా దిగుబడులు కూడా పెరుగుతున్నాయి. 2025-26 ఆయిల్ ఇయర్‌లో 25,242 మంది రైతుల నుంచి 5.24 లక్షల టన్నుల ఆయిల్‌పామ్ గెలలను (ఎఫ్ఎఫ్‌బీ) కొనుగోలు చేశారు. ఇందుకుగాను రూ.1,213 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు. మరోవైపు, రాష్ట్రంలో సుమారు 20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలత ఉందని అంచనా వేస్తున్న ప్రభుత్వం.. కనీసం 10 లక్షల ఎకరాలకు సాగును విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఏడాదికి రెండు లక్షల ఎకరాల్లో కొత్తగా సాగు చేపట్టేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. జిల్లాల వారీగా చూస్తే టీజీ ఆయిల్‌ఫెడ్, గోద్రేజ్, పతంజలి, ఎక్సోపామ్ లాంటి పలు సంస్థలు ఈ సాగును విస్తరిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అత్యధికంగా టీజీ ఆయిల్‌ఫెడ్ ద్వారా 84,109 ఎకరాల్లో సాగు జరుగుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 4 ప్రాసెసింగ్ మిల్లులు నడుస్తుండగా, నిర్మాణం పూర్తయిన మరో 8 మిల్లులు వచ్చే సంవత్సరం అందుబాటులోకి రానున్నాయి.

ప్రాసెసింగ్‌పై ప్రత్యేక దృష్టి: సాగు పెరుగుతున్న నేపథ్యంలో గెలల సేకరణ, ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచడం కీలకంగా మారింది. ఈ క్రమంలో సిద్దిపేట జిల్లా నర్మెట్టలో రోజుకు 250 టన్నుల సామర్థ్యంతో ప్రారంభించి 400 టన్నులకు విస్తరించగల పామాయిల్ శుద్ధి కేంద్రం ఏర్పాటుకు టీజీఆయిల్‌ఫెడ్ అక్టోబర్ 31న టెండర్ జారీ చేసింది. అయితే సాగు విస్తరణతోపాటు రైతులకు గిట్టుబాటు ధర, గెలల సేకరణలో ఇబ్బందులు లేకుండా చూడటం కూడా అత్యంత కీలకం అని నిపుణులు చెబుతున్నారు.

గిట్టుబాటు ధరపై డిమాండ్: సాగు విస్తీర్ణం పెరుగుతున్నప్పటికీ పెట్టుబడి ఖర్చులకు అనుగుణంగా గెలల కనీస హామీ ధరను టన్నుకు రూ.25 వేలుగా నిర్ణయించాలని ఆయిల్ పామ్ రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అంతేకాకుండా రైతులు-కంపెనీల మధ్య ఆదాయ పంపిణీ నిష్పత్తిని ప్రస్తుతమున్న 75:25 నుంచి 80:20కి మార్చాలని తాజాగా సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. రైతుల విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన మంత్రి.. ఆదాయ పంపిణీ నిష్పత్తి పెంపు అంశాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి రైతులకు మరింత న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. వరి లాంటి సంప్రదాయ పంటలకంటే మెరుగైన స్థిర ఆదాయాన్ని అందించే ఆయిల్ పామ్‌పై రైతులు మరింత ఆసక్తి చూపేలా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఈ నేపథ్యంలో ఆయిల్‌పామ్‌కు కనీస హామీ ధర (ఎంజీపీ) ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్రాన్ని కోరింది. మొత్తంగా విస్తీర్ణం పెంపు నుంచి దిగుబడి, కొనుగోలు, శుద్ధి వరకు సమగ్ర వ్యవస్థను బలోపేతం చేయగలిగితే ఆయిల్‌పామ్ తెలంగాణ రైతులకు దీర్ఘకాలిక ఆదాయ వనరుగా మారే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

తెలంగాణ టార్గెట్.. 3 ట్రిలియన్ డాలర్లు!

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం తెలంగాణను మూడు ఆర్థిక జోన్లుగా (క్యూర్, ప్యూర్, రేర్) విభజించినట్లు ముఖ

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శుక్రవారం 20-11-2026

యాదాద్రిలో సత్యనారాయణ స్వామి వ్రతలకు విశేష స్పందన

732 మంది దంపతులు వ్రతాలు నిర్వహణ

సత్యనారాయణ స్వామి వ్రతాల ఆదాయం 4లక్షల 10,000 రూపాయలు

స్వామివారి నిత్య ఆదాయం రూ 21లక్షల 65వేయిల 675 రూపాయలు





ఇది కద నిజం, యాదాద్రి :పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నవంబర్ 10, 2026 నుంచి ప్రారంభమైన వ్రతాలకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. కార్తీక మాసం కావడంతో స్వామివారి క్షేత్రానికి భక్తుల రద్దీ పెరిగింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం అధికారులు వ్రతాల నిర్వహణలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. సాధారణ రోజుల్లో నాలుగు బ్యాచ్‌లుగా నిర్వహించే శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలను ఈసారి ఆరు బ్యాచ్‌లుగా పెంచారు. వ్రతం టికెట్ ధర వెయ్యి రూపాయలుగా నిర్ణయించగా, వ్రతానికి అవసరమైన పూజా సామగ్రిని దేవస్థానం తరపునే భక్తులకు అందజేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం అధికారులు వ్రతాల నిర్వహణలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఇక కార్తీక పౌర్ణమి రోజున భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉండటంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆరోజు ఉదయం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు మొత్తం ఎనిమిది బ్యాచ్‌లుగా సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించనున్నారు. గురువారం 732 మంది దంపతులు స్వామివారి సన్నిధిలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు గురువారం సత్యనారాయణ స్వామి వ్రతాల ఆదాయం 4లక్షల 10వేల రూపాయలు సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. కార్తీక మాసం సందర్భంగా యాదాద్రి క్షేత్రంలో భక్తుల ఆధ్యాత్మిక సందడి నెలకొంది. స్వామివారి నిత్య ఆదాయం రూ: 21,లక్షల 65 వేయిల 675 రూపాయలు సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు.

యాదాద్రిలో అపశ్రుతి

కుప్పకూలిన భారీ టెంట్...10 మంది భక్తులకు గాయాలు!



ఇది కద నిజం, యాదాద్రి :యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో గురువారం అపశ్రుతి చోటుచేసుకుంది. కార్తీక మాసోత్సవాల ఏర్పాట్లలో భాగంగా కొండపైన ఏర్పాటు చేస్తున్న భారీ వైట్ పెండల్ టెంట్ ప్రమాదవశాత్తు కుప్పకూలింది. ఈ ఘటనలో పది మంది భక్తులు గాయపడటంతో ఒక్కసారిగా ఆలయ పరిసరాల్లో ఆందోళన నెలకొంది. కార్తీక మాస వేడుకలను పురస్కరించుకుని ఆలయ ఉత్తర మాఢ వీధుల వద్ద భక్తుల సౌకర్యార్థం సిబ్బంది భారీ టెంట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో టెంట్ నిర్మాణానికి ఉపయోగిస్తున్న ఇనుప రాడ్లు ఒక్కసారిగా అదుపుతప్పి అక్కడే ఉన్న భక్తులపై పడటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఊహించని ఘటనతో భక్తులు భయాందోళనలకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన ఆలయ సిబ్బంది, స్థానికులు సహాయక చర్యలు చేపట్టి రాడ్ల కింద చిక్కుకున్న వారిని బయటకు తీశారు.. ఈ ప్రమాదంలో గాయపడిన పది మంది భక్తులను చికిత్స నిమిత్తం హుటాహుటిన భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కార్తీక మాసోత్సవాల నేపథ్యంలో భక్తుల రద్దీ పెరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడం కలకలం రేపింది. భారీ టెంట్ల ఏర్పాటు సమయంలో భద్రతా ప్రమాణాలు పాటించాల్సిన అవసరాన్ని ఈ ప్రమాదం మరోసారి గుర్తుచేసింది. కార్తీకోత్సవాల ఏర్పాట్లలో భద్రతా లోపాలపై అధికారులు దృష్టి సారించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

జోరుగా సాగుతున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పేదగర్ల సునీత ప్రచార హోరు



ఇది కద నిజం,చింతలపూడి :చింతలపూడి నగర పంచాయతీ చైర్మన్ అభ్యర్థిగా బరిలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి పేదగర్ల సునీత ఇంటింటి ప్రచారంలో దూసుకుపోతున్నారు. చింతలపూడిలో నగర పంచాయతీ ఎన్నికలు మొదటిసారి జరుగుతూ ఉండటంతో ఈ ఎన్నికలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి, ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలుస్తూ, తమ పార్టీ అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ సునీత ప్రచారం నిర్వహిస్తున్నారు.

కంబాపూర్‌లో ఘనంగా ఆసరా పెన్షన్ల పంపిణీ

పేదలకు అండగా ఆసరా పింఛన్లు

సర్పంచ్ గురుగుల సుజాత శ్రావణ్ దేశాయ్



ఇది కద నిజం ,ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నవంబర్ 19: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని కంబాపూర్ గ్రామంలో గురువారం గ్రామ సర్పంచ్ గురుగుల సుజాత శ్రావణ్ దేశాయ్ ఆధ్వర్యంలో ఆసరా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు ఆసరా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుజాత శ్రావణ్ దేశాయ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసాగా నిలుస్తున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర అంజవ్వ, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో







ఇది కద నిజం, యాదాద్రి :కార్తీక మాసోత్సవాల సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో గురువారం కోటి పుష్పార్చన మహోత్సవం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. కోటి నామాలతో, కోటి పుష్పాలతో స్వామివారిని అర్చించే ఈ మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమం యాదాద్రి క్షేత్రంలో ప్రత్యేక భక్తి శోభను సంతరించుకుంది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె. భవాని శంకర్, వేద పండితులు, ఆలయ అర్చక స్వాముల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. అనంతరం వేద పండితులు, అర్చక స్వాములు శ్రీ స్వామివారి సహస్రనామావళిని పఠిస్తూ పుష్పార్చన నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. స్వామివారి దివ్య నామాలను స్మరిస్తూ పుష్పాలతో అర్చనలు నిర్వహించడం ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. గురువారం ప్రారంభమైన ఈ కోటి పుష్పార్చన మహోత్సవం శుక్రవారం మధ్యాహ్నం వరకు నిరంతరాయంగా కొనసాగనుంది. కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమంగానే కాకుండా రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇక మూడు రోజులపాటు నిర్వహించనున్న కార్తీకోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం పద్మశ్రీ పురస్కార గ్రహీత బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ ఆధ్యాత్మిక ప్రవచనం, తేలు విజయ బృందం భక్తి సంగీత కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నెల 21న ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక సంగీత విభావరి, 22న ఒడిస్సీ, తెలంగాణ ఆలయాల వైభవాన్ని తెలిపే నృత్య రూపకం, పేరిణి నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నారు. కార్తీక మాస పవిత్రతను చాటిచెబుతూ యాదగిరిగుట్ట క్షేత్రం ఆధ్యాత్మిక, భక్తి, సాంస్కృతిక వైభవానికి వేదికగా నిలుస్తోంది. ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని దేవస్థానం అధికారులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు, డీఈఓ ధోర్బాల భాస్కర్ శర్మ, ఏఈఓ డి.సురేందర్ రెడ్డి. రాజన్ బాబు, అర్చక బృందం మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు..

ప్రగడవరంలో వైసీపీ ఎన్నికల ప్రచారం

భారీగా పాల్గొన్న పార్టీ శ్రేణులు

చర్చి నిర్మాణానికి రూ.15 లక్షలు, రామాలయ నిర్మాణానికి రూ.5 లక్షలు ప్రకటించిన వైసీపీ నాయకులు



ఇది కద నిజం ,ఏలూరు జిల్లా, చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి గుంటక వరలక్ష్మి, 3వ వార్డు అభ్యర్థి కొప్పుల మురళి, 8వ వార్డు అభ్యర్థి పాలపాటి వెంకన్న ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కోటగిరి కాలనీ, గౌడ బజారు, మాలపల్లి ప్రాంతాల్లో నిర్వహించిన ప్రచార ర్యాలీకి వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. ప్రచారంలో భాగంగా గూడెంలోని సీఎస్ఐ చర్చి నిర్మాణానికి రూ.15 లక్షలు, మాలపల్లి ప్రాంతంలోని రామాలయ నిర్మాణానికి రూ.5 లక్షలు అందిస్తామని వైసీపీ నాయకులు బీవీఎస్ రెడ్డి, చిలుకూరి ప్రతాప్ రెడ్డి ప్రకటించారు. అదేవిధంగా 8వ వార్డు అభ్యర్థి పాలపాటి వెంకన్నను వైసీపీ ఉపసర్పంచ్ అభ్యర్థిగా ప్రకటించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి గుంటక వరలక్ష్మి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం దళితులకు పెద్దపీట వేసిందని, గతంలో ఇంటింటికీ రేషన్ పంపిణీ, వాలంటీర్ల సేవలు, ప్రభుత్వ పథకాలు ప్రజలకు నేరుగా అందేవని పేర్కొన్నారు. ఆ సేవలన్నీ తిరిగి అందుబాటులోకి రావాలంటే వైసీపీకి మద్దతు పలకాలని కోరారు. గతంలో గ్రామానికి ఒక వీఆర్వో, ఒక పంచాయతీ కార్యదర్శి మాత్రమే ఉండేవారని, ప్రజలు తమ పనుల కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేదని, వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామస్థాయిలో పది మందికి పైగా అధికారులను గ్రామప్రజలకు అందుబాటులో నియమించింది. వైసీపీ సీనియర్ నాయకుడు బీవీఎస్ రెడ్డి మాట్లాడుతూ దళితవాడలో ఏ సమస్య వచ్చినా పార్టీలకు అతీతంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం గుంటక వరలక్ష్మి మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే తనను సర్పంచ్‌గా, గ్రామ ప్రజల కోసం కష్టపడుతున్న పాలపాటి వెంకన్నను ఉపసర్పంచ్‌గా గెలిపించాలని గ్రామంలోని అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు, అవ్వాతాతలను చేతులు జోడించి అభ్యర్థించారు.

స్వర్ణగిరి దివ్యక్షేత్రంలో వైభవంగా

నిత్య కళ్యాణోత్సవం, తిరువీధి ఉత్సవ సేవలు





ఇది కద నిజం :స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్యక్షేత్రంలో కార్తీక మాస శోభతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. శ్రీ పరాభవ నామ సంవత్సరం, దక్షిణాయనం, కార్తీక మాసం శుక్ల పక్ష షష్ఠి, ఆదివారం (నవంబర్ 15) సందర్భంగా ప్రాతఃకాలంలోనే అర్చక స్వాములు కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారికి సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించారు. అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరిన గోపృష్ఠ దర్శనాన్ని భక్తులకు చేయించారు. ఉదయం 5:45 గంటలకు స్వామివారి నిత్యారాధన నిమిత్తం వేదమంత్రోచ్ఛారణల నడుమ బంగారుబావి నుండి సువర్ణ బిందె తీర్థమును అర్చకులు తీసుకువచ్చారు. ఉదయం 7:00 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామివారిని మణిమయ శోభిత స్వర్ణాభరణాలు, పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి సహస్రనామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసోత్సవాలలో భాగంగా ఆలయంలోని అష్టలక్ష్మి మంటపంలో కార్తీక దామోదర హవనమును, అనంతరం వైభవ మంటపంలో సత్యనారాయణ వ్రతాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.ఉదయం 10:30 గంటలకు విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామివారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ నిత్య కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కమనీయ ఘట్టాన్ని తిలకించిన భక్తులు ఆనంద పరవశులయ్యారు. ఆలయ నిత్యాన్న ప్రసాద వితరణలో భాగంగా ఈరోజు సుమారు 3,000 మందికి పైగా భక్తులు స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

సాయంత్రం సంధ్యా వేళ ఆలయ ధ్వజస్తంభమునకు భక్తిశ్రద్ధలతో మోక్ష నారాయణ దీపాన్ని వెలిగించారు. రాత్రి 6:30 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామివారిని మాడవీధులలో శోభాయమానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలు, మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా జరిపించారు. అనంతరం దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య స్వామివారు ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమివ్వగా, అర్చకులు వేదమంత్రాలతో అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు. ఈ నయనానందకరమైన దృశ్యాన్ని దర్శించుకున్న భక్తులు తన్మయత్వం చెందారు.

పిట్లంలో ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

దేశ సమగ్రతకు, అభివృద్ధికి ఇందిరమ్మ చేసిన సేవలు చిరస్మరణీయం



ఇది కద నిజం,ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నవంబర్ 19: కామారెడ్డి జిల్లా పిట్లం భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి, ఉక్కు మహిళగా పేరుగాంచిన స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి వేడుకలను పిట్లం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ అభివృద్ధికి, సమగ్రతకు ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశ ఐక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆమె చేసిన కృషి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుమ్మరి శేఖర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పిట్లం ఎంజేపీటీలో ఘనంగా వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి



ఇది కద నిజం ,ఉమ్మడి నిజాంబాద్ జిల్లా ఇన్చార్జి నవంబర్ 19, పిట్లం: పిట్లం ఎంజేపీటీలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె జీవిత చరిత్ర, దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటం, ధైర్యసాహసాల గురించి విద్యార్థులకు వివరించారు. వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి త్యాగం, తెగువ ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రచారక్ రాము, విహెచ్‌పీ సంయోజక్ రంజిత్, బాబీ సెట్ జితేందర్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాయ్స్ టౌన్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో ఘనంగా 'నేషనల్ మాంట్‌ఫోర్ట్ గేమ్స్' ప్రారంభం



ఇది కద నిజం ,హైదరాబాద్: బాయ్స్ టౌన్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో నవంబర్ 19 నుండి 22 వరకు నాలుగు రోజుల పాటు జరగనున్న 'నేషనల్ మాంట్‌ఫోర్ట్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మాంట్‌జెనిక్స్' క్రీడా పోటీలు అత్యంత ఉత్సాహంగా, వైభవంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర మరియు మధ్యప్రదేశ్ అనే నాలుగు రాష్ట్రాలలోని 15 పాఠశాలల నుండి 1,200 మందికి పైగా యువ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఒకే వేదికపైకి చేరారు. ఈ అద్భుతమైన ప్రారంభోత్సవ వేడుకను అతిథులు, క్రీడాకారులు మరియు నిర్వాహకులు ఎంతగానో ప్రశంసించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ ఐపిఎస్ అధికారిణి శ్రీమతి అరుణా బగునాన, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రదర్స్ ఆఫ్ సెయింట్ గాబ్రియేల్ అసిస్టెంట్ జనరల్ రెవరెండ్ బ్రదర్ వర్గీస్ మందపతిల్, బ్రదర్స్ ఆఫ్ సెయింట్ గాబ్రియేల్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ రెవరెండ్ బ్రదర్ సైన్ అలెక్స్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వీరితో పాటు కార్యక్రమ కన్వీనర్ మరియు బాయ్స్ టౌన్ ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ రెవరెండ్ బ్రదర్ సంతోష్ కుమార్, ప్రెసిడెంట్ మరియు ఎస్ఎస్‌సి ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ ఆరోగ్యం పసల, ప్రత్యేక అతిథిగా హైదరాబాద్ అబిడ్స్‌లోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ పి. ఆంథోనీ మరియు కమ్యూనిటీకి చెందిన ఇతర రెవరెండ్ బ్రదర్స్ ఈ వేడుకలో పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు సాగే ఈ క్రీడా సంబరంలో అథ్లెటిక్స్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్ మరియు ఖో-ఖో విభాగాల్లో హోరాహోరీ పోటీలు జరగనున్నాయి. వందలాది మంది క్రీడాకారులు, బృంద నిర్వాహకులు, సాంకేతిక అధికారులు మరియు కోచ్‌ల రాకతో బాయ్స్ టౌన్ ప్రాంగణం కళకళలాడుతోంది. యువ క్రీడాకారుల ప్రతిభకు, జట్టు స్ఫూర్తికి, స్నేహభావానికి మరియు ఆరోగ్యకరమైన క్రీడా పోటీకి ఈ వేదిక ఒక ఉత్సాహభరితమైన కేంద్రంగా మారింది.





Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శుక్రవారం 20-11-2026



సినిమా న్యూస్





లోన్ వోల్ఫ్‌గా రామ్

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని సరికొత్త ప్రయత్నం చేయబోతున్నారు. హీరోగా నటిస్తూనే దర్శకుడిగా మారి 'రాపో-23' సినిమాను తెరకెక్కిస్తున్నారు. రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై కృష్ణ పోతినేని భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రానికి రామ్ స్వయంగా కథ, దర్శకత్వం వహిస్తున్నారు. ఇక ఇందులో రామ్ పోతినేని సరసన సంయుక్త మీనన్ హీరోయిన్‌గా నటించనుండగా.. బాలీవుడ్ స్టార్ పటుడు రితేశ్ దేశ్‌ముఖ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. ఈనేపథ్యంలో.. అంతర్జాతీయ పురుషుల దినోత్సవం సందర్భంగా మూవీ మేకర్స్ అదిరిపోయే పోస్టర్‌ను షేర్ చేసి భారీ అంచనాలను పెంచారు.

ఈ సినిమా ప్రీ-లుక్‌ను విడుదల చేసి, రామ్ పాత్రపై ఆసక్తిని పెంచారు. 'ది స్టోరీ ఆఫ్ ఎ లోన్ వోల్ఫ్' అనే క్యాప్షన్‌తో రిలీజ్ అయిన ఈ ప్రీ-లుక్‌లో రామ్ పోతినేని మొత్తం బ్లాక్ డ్రెస్‌లో ఉండగా.. ఒక చేతిలో తుపాకి, మరో చేతిలో టెడ్డీ బేర్ పట్టుకుని నిల్చున్న లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. తన దారిని తానే ఎంచుకుని, ప్రపంచాన్ని ఒంటరిగా ఎదుర్కొనే ఒక స్వతంత్ర వ్యక్తి కథగా ఈ సినిమా ఉండబోతుందని మేకర్స్ స్పష్టం చేశారు. అలాగే టైటిల్ టీజర్‌ను కూడా త్వరలోనే రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మేకర్స్ విడుదల చేసిన రామ్ ప్రీ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ప్రమోషన్లలో అనిల్ రచ్చ!

2027 సంక్రాంతి బరిలో నిలిచిన మోస్ట్ అవైటెడ్ చిత్రాల్లో 'జనవరి 12 విడుదల' ఒకటి. విక్టరీ వెంకటేష్, కీర్తి సురేష్, కళ్యాణ్ రామ్, కృతి శెట్టి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్‌కు సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. 'ప్రమోషన్ అంటే చాలు అందరికంటే ముందుంటాం' అన్నట్లుగా అనిల్ రావిపూడి అండ్ టీమ్ మరోసారి తమ మార్క్ ప్రమోషన్లతో సందడి మొదలుపెట్టారు . ఫస్ట్ సింగిల్ అప్‌డేట్‌ను పంచడానికి మేకర్స్ ఓ సరదా ప్రోమోను విడుదల చేశారు. రజనీకాంత్ నటించిన 'దళపతి' సినిమాలోని ఫేమస్ సీన్‌ను అనిల్ రావిపూడి, కృతి శెట్టి కలిసి ఫన్నీ ట్విస్ట్‌తో రీక్రియేట్ చేశారు. తాను కీర్తి సురేష్‌తో రీల్ చేయాలనుకుంటున్నట్లు తెలిపిన కృతిపై అనిల్ రావిపూడి ఫుల్ ఫైర్ అవుతారు. అయినప్పటికీ సరే అని అనడంతో కృతి నవ్వుతూ వెళ్లిపోతుంది. ఏమంటున్నాడని అడగ్గా.. రీల్‌లో లేనందుకు ఫీల్ అవుతున్నాడని అంటుంది.

దీంతో ఇది ఆడవాళ్ల రీల్ అని ఎప్పుడు అర్థమవుతుందో అని బెడ్‌రూమ్‌లోకి వెళ్లిన కీర్తి, కృతి చీరకట్టులో మాస్ స్టెప్పులు వేస్తారు. ఇక ఈ వీడియోను సోషల్ మీడియా ద్వారా షేర్ చేసిన మేకర్స్.. రేపటి నుంచి మ్యూజికల్ ప్రమోషన్లు మొదలుపెడుతున్నట్లు స్పష్టం చేశారు. గర్ల్స్ సాంగ్‌తో ఒక ఊపు ఊపడానికి రాబోతున్నట్లు హింట్ ఇచ్చారు. దీంతో ఈ వీడియో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి వచ్చేసింది. అయితే రాబోయే సంక్రాంతి సినిమాలన్నింటిలో పాటల ప్రమోషన్లు మొదలుపెడుతున్న తొలి చిత్రం ఇదే కావడం విశేషం. షైన్ స్క్రీన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాకు సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నాయి. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 12న సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే అధికారికంగా ప్రకటించింది. వెంకటేష్, కళ్యాణ్ రామ్ కాంబినేషన్‌తో పాటు అనిల్ రావిపూడి కామెడీ టైమింగ్ ఈ సినిమాపై భారీ అంచనాలను పెంచుతున్నాయి.



'విశ్వంభర' ట్రైలర్ రెడీ

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' మరోసారి వార్తల్లో నిలిచింది. బింబిసార ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై మెగా అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే ఈ మూవీకి సంబంధించి ఏ అప్డ్టే వచ్చిన అది క్షణాల్లో వైరల్ అవుతుంది. ఈ క్రమంలో తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్ అప్‌డేట్ ఆసక్తిని పెంచుతోంది. దర్శకుడు వశిష్ఠ ట్రైలర్ కట్ సిద్ధంగా ఉందని వెల్లడించినట్లు సమాచారం. అయితే సినిమా థియేట్రికల్ రిలీజ్ డేట్‌ను ఖరారు చేసిన తర్వాతే ట్రైలర్‌ను విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారట. గతంలో విడుదలైన టీజర్‌లోని విజువల్ ఎఫెక్ట్స్‌పై కొంత అసంతృప్తి వ్యక్తం కావడంతో చిత్రబృందం గ్రాఫిక్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ఇప్పుడు ట్రైలర్‌తోనే సినిమాపై భారీ బజ్ క్రియేట్ చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఈ ట్రైలర్ సినిమాను ఏ లెవల్‌కు తీసుకెళ్తుందో వేచి చూడాల్సి ఉంది. కాగా.. ఇందులో త్రిష హీరోయిన్‌గా నటిస్తుండగా, ఆషికా రంగనాథ్, మౌనీ రాయ్, కునాల్ కపూర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తుండగా, యూవీ క్రియేషన్స్ సంస్థ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది.



'ధురంధర్' కాంబో రిపీట్..

'ధురంధర్' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'ప్రళయ్' చిత్రంలో నటిస్తున్నాడు. మరోవైపు ధురంధర్ దర్శకుడు ఆదిత్య ధర్ మాత్రం తన తదుపరి సినిమా విషయంలో ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. అయితే ఆయన కొత్త ప్రాజెక్ట్‌పై కొంతకాలంగా రకరకాల వార్తలు, ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గతంలో విక్కీ కౌశల్‌తో ప్రకటించిన 'ది ఇమ్మోర్టల్ అశ్వత్థామ' కథను అల్లు అర్జున్‌కు వినిపించాడని ప్రచారం జరిగింది. ఆ ప్రాజెక్ట్ ముందుకు వెళ్లకపోవడంతో ఎన్టీఆర్, ప్రభాస్‌లకు కూడా కొత్త కథలు వినిపించినట్లు వార్తలు వచ్చాయి. చివరకు విక్కీ కౌశల్‌తోనే అశ్వత్థామ సినిమాను తెరకెక్కించనున్నాడంటూ మరోసారి గాసిప్స్ వినిపించాయి. అయితే వీటిలో ఏ ఒక్క అంశంపైనా ఇప్పటివరకు అధికారిక స్పష్టత లేదు.

ఇదిలా ఉంటే ఆదిత్య ధర్ తన తదుపరి సినిమాను టాలీవుడ్ హీరోతో చేయనున్నాడని గతంలో ప్రచారం జరిగింది. కానీ తాజాగా రణ్‌వీర్ సింగ్ పేరు తెరపైకి వచ్చింది. ధురంధర్ కాంబినేషన్ మరోసారి చేతులు కలపబోతోందని బాలీవుడ్ వర్గాల్లో బజ్ వినిపిస్తోంది. అశ్వత్థామ, ఆర్య వర్త్ కథలను పక్కన పెట్టి.. తన డ్రీమ్ ప్రాజెక్ట్‌గా భావిస్తున్న చంద్రగుప్త మౌర్య జీవిత కథను వెండితెరపైకి తీసుకురావాలని ఆదిత్య ధర్ భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ పనుల్లో ఆయన బిజీగా ఉన్నారట. 2027లో చిత్రీకరణ ప్రారంభించి.. 2028 చివర్లో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నాడని టాక్.

ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన ధురంధర్ అనూహ్య విజయాన్ని అందుకుని రూ.1,300 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. దీంతో సీక్వెల్‌పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ధురంధర్: ది రివెంజ్ కూడా బాక్సాఫీస్ వద్ద రూ.1,800 కోట్ల వసూళ్లతో సంచలనం సృష్టించి.. భారతీయ సినిమాల్లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల జాబితాలో రెండో స్థానానికి చేరింది. ఈ నేపథ్యంలో రణ్‌వీర్ సింగ్, ఆదిత్య ధర్ మరోసారి కలిసి పనిచేస్తే.. ఆ సినిమాపై అంచనాలు ఏ స్థాయిలో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే చంద్రగుప్త మౌర్య బయోపిక్ కోసం వీరిద్దరూ నిజంగానే చేతులు కలుపుతున్నారా? లేక ఇది కూడా మరో ప్రచారానికే పరిమితం అవుతుందా? అనేది అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

